

### టీటీలో ప్రీక్వార్టర్స్‌కు ఆకుల శ్రీజ

# భలే మంచి రోజు

## ఒలింపిక్స్‌లో ఐదో రోజు భారత్‌కు మెరుగైన ఫలితాలు

**షూటింగ్ పతక రేసులో స్వప్నిల్ కుశాలె • పతకానికి అడుగు దూరంలో లవ్లీనా**

**బ్యాడ్మింటన్‌లో అదరగొట్టిన సింధు, లక్ష్యసేన్ • ఆర్చరీలో రాణించిన దీపికా కుమారి**



పారిస్ ఒలింపిక్స్‌లో ఐదో రోజు భారత అథ్లెట్లు మెరుగైన ఫలితాలు సాధించి పతకాల వేటలో ముందంజ వేశారు. షూటింగ్ సంచలనం మను భాకర్ 'డబుల్ మెడల్' ఇచ్చిన స్ఫూర్తితో బుధవారం మన క్రీడాకారులు ఆయా క్రీడాంశాల్లో విజయాలతో సత్తా చాటారు. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ క్వాలిఫయర్స్‌లో భారత యువ షూటర్ స్వప్నిల్ కుశాలె ఏడో స్థానంతో ముగించి గురువారం జరిగే పతక రేసుకు అర్హత సాధించి మరో మెడల్‌పై ఆశలు రేపుతున్నాడు. తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ టేబుల్ టెన్నిస్‌లో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, లక్ష్యసేన్ తమ ప్రత్యర్థులను చిత్తు చేసి ప్రిక్వార్టర్స్‌కు అర్హత సాధించగా గత ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన యువ బాక్సర్ లవ్లీనా బొర్గొహెయిన్ క్వార్టర్స్ చేరి పతకానికి అడుగు దూరంలో నిలిచింది. ఆర్చరీలో దీపికా కుమారి రాణించగా రోయింగ్, ఈక్వెస్ట్రియన్‌లో మన అథ్లెట్లు పతకాలు తేకున్నా ఉన్నంతలో ఫర్వాలేదనిపించారు.

పారిస్: షూటింగ్‌లో మూడు రోజుల వ్యవధిలోనే రెండు పతకాలు సాధించి జోరుమీదున్న భారత్‌కు ఐదో రోజు ఆశాజనక ఫలితాలు వచ్చాయి. మరో షూటర్ స్వప్నిల్ కుశాలె పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ (3పీ) క్వాలిఫికేషన్ రౌండ్‌లో 590 (38 షాట్లు) పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానంతో ముగించాడు. తద్వారా అతడు గురువారం జరిగే మెడల్ రేసులోకి వచ్చి భారత్‌కు మరో పతకంపై ఆశలు రేపుతున్నాడు. నీలింగ్ (మోకాళ్ల మీద కూర్చునే) పొజిషన్‌లో రెండు సిరీస్‌లలో రెండు సార్లూ 99 పాయింట్లు స్కోరు చేసిన స్వప్నిల్.. ప్రోన్ (పడుకుని) పొజిషన్‌లో 98, 99 పాయింట్లు రాబట్టాడు. స్టాండింగ్ (నిలుచుని)లో 98, 97 స్కోరు చేసి టాప్-8లో చోటు సంపాదించుకున్నాడు. గురువారం జరిగే పతక పోరులోనూ స్వప్నిల్ సత్తా చాటితే పారిస్‌లో భారత్‌కు మూడో పతకం తెచ్చిన మూడో షూటర్‌గా నిలుస్తాడు. ఇదే ఈవెంట్‌లో పోటీపడ్డ మరో భారత షూటర్ ఐశ్వర్యప్రతాప్ సింగ్ తోమర్ 11వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. మహిళల ట్రాప్ షూటింగ్ క్వాలిఫికేషన్‌లో భారత అమ్మాయిలు రాజేశ్వరి కుమారి (22వ స్థానం), శ్రేయాసి సింగ్ (23) నిరాశపరిచారు.



స్వప్నిల్ కుశాలె

## షట్లర్ల జోరు

గత రెండు ఒలింపిక్స్‌లో రజతం, కాంస్యం సాధించి ఈసారి పతకం రంగు మార్చాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన పీవీ సింధు ఆ దిశగా మరో అడుగు ముందుకేసింది. బుధవారం జరిగిన గ్రూప్-ఎం మహిళల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో సింధు 21-5, 21-10తో క్రిస్టిన్ కూబ (ఇస్తోనియా)ను చిత్తుగా ఓడించి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. సింధు జోరు ముందు 73వ ర్యాంకర్ క్రిస్టిన్ ఏమాత్రం నిలవలేకపోయింది. 33 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన సింధుకు.. ప్రిక్వార్టర్స్ నుంచి కఠిన ప్రత్యర్థులు ఎదురుకానున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-18, 21-12తో తనకంటే మెరుగైన ర్యాంకు కలిగిన జొనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా)ని మట్టికరిపించాడు. ప్రపంచ నాలుగో ర్యాంకర్ అయిన క్రిస్టీ తొలి గేమ్‌లో సేన్‌కు సవాళ్లు విసిరినా రెండో గేమ్‌లో మాత్రం తేలిపోయాడు. ఇక మరో పోరులో హెచ్‌ఎస్ ప్రణయ్.. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 16-21, 21-11, 21-12తో లీ డు ఫట్(వియత్నాం)పై అద్భుత విజయం సాధించాడు. ప్రత్యర్థికి తొలి గేమ్ కోల్పోయిన ప్రణయ్.. ఆ తర్వాత పుంజుకుని వరుస గేముల్లో మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. నెట్‌గేమ్‌కు తోడు స్మాష్‌లు, డ్రాప్‌షాట్లతో ఆకట్టుకున్న ప్రణయ్..కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు.

## శ్రీజ ముందంజ..

టేబుల్ టెన్నిస్‌లో భారత్‌కు పతక ఆశలు రేపుతున్నవారిలో ముందున్న హైదరాబాదీ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బుధవారం జరిగిన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో శ్రీజ 4-2 (9-11, 12-10, 11-4, 11-5, 10-12, 12-10)తో జియాన్ జెంగ్ (సింగపూర్)ను ఓడించింది. 51 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్ తొలి గేమ్‌లో వెనుకబడ్డా తర్వాత పుంజుకున్న శ్రీజ వరుసగా మూడు గేమ్‌లు గెలిచింది. ఐదో గేమ్‌ను ప్రత్యర్థి గెలుచుకున్నా చివరి గేమ్‌ను నెగ్గి ఒలింపిక్స్‌లో మనికా బాత్రా తర్వాత ప్రిక్వార్టర్స్‌కు చేరిన రెండో ప్యాడ్లర్‌గా నిలిచింది. ప్రిక్వార్టర్స్‌లో శ్రీజ.. చైనా అమ్మాయి, వరల్డ్ నంబర్‌వన్ ర్యాంకర్ అయిన సున్ యింగ్షాతో అమీతుమీ తేల్చుకోనుంది. ప్రిక్వార్టర్స్‌లో మనికా 6-11, 9-11, 14-12, 8-11, 6-11తో మియు హిరానో(జపాన్) చేతిలో ఓటమిపాలైంది.

## ఓడినా చరిత్రే..



పారిస్‌లో భారత్ నుంచి ఈక్వెస్ట్రియన్ (గుర్రపు స్వారీ) పోటీలలో పాల్గొన్న అనూష్ అగర్వాల బుధవారం జరిగిన వ్యక్తిగత డ్రెస్సేజ్ కేటగిరీలో 9వ స్థానంలో నిలిచి పతక రేసు నుంచి నిష్క్రమించాడు. అనూష్ ఓడినా ఈ క్రీడలో భారత్ తరపున ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం గమనార్హం. ఇక పురుషుల రోయింగ్‌లో సెమీస్ చేరడంలో విఫలమైన బాల్‌రాజ్ పన్వర్ వర్గీకరణ రౌండ్‌లో ఆరో స్థానంలో నిలిచాడు. తద్వారా అతడు 19-24 మధ్య ర్యాంకుల కోసం జరిగే పోరుకు అర్హత సాధించాడు.

## ఇంకొక్క అడుగే



గత ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన అసోం యువ బాక్సర్ లవ్లీనా బొర్గొహెయిన్ పారిస్‌లోనూ మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించేందుకు ఒక్క అడుగు దూరంలో నిలిచింది. మహిళల 75 కిలోల విభాగం ప్రిక్వార్టర్స్‌లో లవ్లీనా 5-0తో సున్నివ హెఫ్‌స్టడ్‌ను చిత్తుగా ఓడించి క్వార్టర్స్ బెర్తును దక్కించుకుంది. మూడు రౌండ్లలోనూ ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగిన లవ్లీనా.. క్వార్టర్స్‌లో చైనాకు చెందిన టాప్ సీడ్ బాక్సర్ లి కియాన్‌తో తలపడనుంది. ఈ పోరులో గెలిచి సెమీస్ చేరితే లవ్లీనా భారత్‌కు మరో పతకం ఖాయం చేసినట్టే. కాగా మరో యువ బాక్సర్ ప్రీతి పన్వర్ పోరాటం ముగిసింది. మహిళల ప్రిక్వార్టర్స్‌లో ప్రీతి 2-3తో యెని మర్కెల (కొలంబియా) చేతిలో పోరాడి ఓడింది.

## దీపికా అదుర్స్



మహిళల వ్యక్తిగత ఆర్చరీ విభాగంలో భారత సీనియర్ ఆర్చర్ దీపికా కుమారి ప్రిక్వార్టర్స్ చేరింది. బుధవారం వరుసగా రౌండ్ ఆఫ్-32, రౌండ్ ఆఫ్ 16 ఎలిమినేషన్ మ్యాచ్‌లలో గెలిచి సత్తా చాటింది. తొలి మ్యాచ్‌లో దీపికా 6-5తో రీనా పర్ణత్ (ఇస్తోనియా)ను ఓడించింది. అదే జోరులో 6-2తో క్వింటి రొఫెన్ (నెదర్లాండ్స్)పై నెగ్గింది. ప్రిక్వార్టర్స్‌లో దీపికా జర్మనీకి చెందిన మిచెల్ క్రూపెన్‌తో తలపడనుంది. మహిళల వ్యక్తిగత ఈవెంట్‌లో భజన్ కౌర్ సైతం ప్రిక్వార్టర్స్ చేరిన విషయం విదితమే. పురుషుల రౌండ్ ఆఫ్-32 ఎలిమినేషన్‌లో తరుణ్‌దీప్ రాయ్ 4-6తో టామ్ హాల్(బ్రిటన్) చేతిలో ఓటమితో నిష్క్రమించాడు.

### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 8 | 7 | 3 | 18 |
| 2 | జపాన్ | 8 | 3 | 4 | 15 |
| 3 | ఫ్రాన్స్ | 7 | 9 | 8 | 24 |
| 4 | ఆస్ట్రేలియా | 7 | 4 | 3 | 14 |
| 5 | బ్రిటన్ | 6 | 6 | 5 | 17 |
| 6 | కొరియా | 5 | 3 | 3 | 11 |
| 39 | భారత్ | 0 | 0 | 2 | 2 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

## హృతిక్‌గౌడ్ పసిడి పంచ్

**జాతీయ కిక్ బాక్సింగ్‌లో మెరిసిన సిరిసిల్లా యువకుడు**



సిరిసిల్ల రూరల్, జూలై 31: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండెపల్లికి చెందిన మెరుపుల హృతిక్‌గౌడ్ జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీలో మెరుపులు మెరిపించాడు. ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు గోవాలో జరిగిన ఆల్‌ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో పసిడి పతకంతో సత్తాచాటాడు. తన పవర్‌ఫుల్ పంచ్‌లతో చెలరేగుతూ ప్రత్యర్థులను మట్టికరిపించి ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నాడు. గత నెలలో మహారాష్ట్ర జలగావ్‌లో జరిగిన జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీల్లో హృతిక్ స్వర్ణం సాధించాడు. ఓవైపు సీఏ పరీక్షలకు సిద్ధమవుతూనే కిక్‌బాక్సింగ్‌లో పతకాలు సాధించడం ఆనందంగా ఉందని అతని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.మా ఊరి యువకుడు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు గెలువడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముచ్చర్లలో అంతర్జాతీయ స్టేడియం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రంలో క్రికెట్ సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే కచ్చితంగా ప్రతి జిల్లాలో ఒక స్టేడియం నిర్మించాలని, హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ స్టేడియం నిర్మించాలని ప్రభుత్వాన్ని హెచ్‌సీఏ కోరింది. హెచ్‌సీఏ కోశాధికారి సీజే శ్రీనివాసరావు..సీఎం రేవంత్‌రెడ్డికి ఇటీవలే వినతిపత్రం అందజేశారు. అయితే బుధవారం అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించే క్రమంలో ముచ్చర్లలో స్పోర్ట్స్ హబ్, అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని సీఎం ప్రకటించారు. ఇందుకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.



హర్యానా వేదికగా జరిగిన 42వ జాతీయ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ టీమ్ రన్నరప్‌గా నిలిచింది. ఈ టోర్నీలో ఢిల్లీ చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది.

## క్వార్టర్స్‌కు 'మట్టికోర్టు' వీరులు

**స్వియాటెక్, అల్కారజ్, నాగల్ ముందంజ**



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ అంటేనే ఎక్కడ లేని ఎనర్జీతో కదం తొక్కే మట్టికోర్టు మహావీరుడు రఫెల్ నాదల్, అతడి బాటలోనే వెళ్తున్న యువ సంచలనాలు కార్లోస్ అల్కారజ్, ఇగా స్వియాటెక్ (పోలండ్) ఒలింపిక్స్‌లో క్వార్టర్స్ చేరారు. ఫిలిప్పీ చార్టర్ వేదికగా బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో స్వియాటెక్ 6-2, 6-4తో వాంగ్ జియు (చైనా)ను చిత్తుచేసి క్వార్టర్స్ చేరింది. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో స్వియాటెక్ తండ్రి థామస్ స్వియాటెక్ సైతం క్వార్టర్స్ చేరడం విశేషం. ఇక పురుషుల డబుల్స్‌లో అల్కారజ్-నాదల్ (స్పెయిన్) ద్వయం 6-4, 6-7(2), 10-2తో గ్రీక్స్‌పర్-కూల్‌హఫ్ (నెదర్లాండ్స్)ను ఓడించి క్వార్టర్స్ చేరా రు. కొద్ది రోజుల క్రితమే ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో అల్కారజ్, స్వియాటెక్ విజేతలుగా నిలిచిన విషయం విదితమే.

## బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌పై కేసు

**కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇది ఏడోసారి**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 31 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ నాయకుడు క్రిశాంక్‌పై నగర సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పరువుకు నష్టం కలిగించేలా ట్వీట్ చేశారంటూ ఎల్బీనగర్‌కు చెందిన శశిధర్‌రెడ్డి జూలై 30న సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్రిశాంక్‌పై ఐటీ చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత క్రిశాంక్‌పై వివిధ కారణాలతో వరుసగా కేసులు నమోదవుతున్నాయి. తాజాగా నమోదైన కేసు ఏడోది కావడం గమనార్హం.

## 'నేరెళ్ల' ఇంటిపై ఈడీ దాడులు

**71.61 కోట్ల ఆస్తుల అటాచ్**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 31(నమస్తే తెలంగాణ): ఐడీబీఐ బ్యాంకును మోసం చేసిన కేసు దర్యాప్తులో భాగంగా నగరంలోని నేరెళ్ల వెంకటరామ్మోహన్‌రావు, అతని బంధువుల ఇండ్లపై బుధవారం ఈడీ అధికారులు దాడులు జరిపారు. మొత్తం రూ.71.61 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను గుర్తించి అటాచ్ చేశారు. వెంకటరామ్మోహన్‌రావు తన కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేర్లపై రాజమండ్రిలోని ఐడీబీఐ నుంచి నకిలీ కిసాన్ క్రెడిట్ కార్డులపై ఫిష్ ట్యాంక్ రుణాలు తీసుకున్నాడని, ఈ క్రమంలో బ్యాంకుకు రూ.311.05 కోట్ల మేర మోసం చేశాడని ఆరోపణలు వచ్చాయి.

# పొంగులేటి సంస్థకు ఏపీ నోటీసులు

- కాంట్రాక్టులో అవకతవకలపై దర్యాప్తునకు ఆదేశం
- టెండర్ దక్కించుకొని ఏడాది గడిచినా పనులు ప్రారంభించకపోవడంపై నిర్ణయం



హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి అప్పగించిన కాంట్రాక్టులో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై ఏపీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విశాఖతోపాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో భూగర్భంలో విద్యుత్తు లైన్లు వేసే కాంట్రాక్టును పొంగులేటికి చెందిన రాఘవ సంస్థకు ఏపీ ప్రభుత్వం 2022 డిసెంబర్‌లో అప్పగించింది. ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.1,194 కోట్లుగా అంచనా వేయగా, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు రూ.1,599.93 కోట్లకు అప్పగించారు. అంచనా వ్యయం కన్నా అధిక వ్యయానికి కాంట్రాక్టును అప్పగించడంపై చంద్రబాబు ప్రభుత్వం దర్యాప్తుకు ఆదేశించింది. కాంట్రాక్టు అప్పగించి ఏడాది గడిచినా ఇంకా పనులు ప్రారంభించకపోవడంపై రాఘవ సంస్థకు నోటీసులు జారీచేసింది. వెంటనే పనులు ప్రారంభించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విద్యుత్తు పునర్వ్యవస్థీకరణ పథకం ప్రకారం పనులు పూర్తయితేనే కేంద్రం నుంచి నిధులు మంజూరవుతాయనే విషయాన్ని ఏపీ ప్రభుత్వం తమ నోటీసులో వివరించింది.

### అంచనాలను భారీగా పెంచి..

ఏపీ ప్రభుత్వం భూగర్భ విద్యుత్తు లైన్ల పనులకు రూ.1,194 కోట్లు, రింగ్ మెయిన్ యూనిట్ పనులకు అదనంగా మరో రూ.314 కోట్ల అంచనా వ్యయంతో వేర్వేరుగా టెండర్లు పిలిచింది. అయితే మొదటి సారిగా పిలిచిన టెండర్ల కంటే రూ.343 కోట్లు అదనంగా పెంచడంతో దీనిపై 10 శాతం అదనంగా కోడ్ చేసిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ కాంట్రాక్టును దక్కించుకుంది. పనులు పూర్తయితే మంత్రి పొంగులేటి కంపెనీకి ఈపీడీసీఎల్ రూ.1285.94 కోట్లు చెల్లించనుంది. ఇది టెండర్ ధర కంటే రూ.91.94 కోట్లు అధికం. దీనికి రింగ్ మెయిన్ యూనిట్ పనులకు కేటాయించిన రూ.314కోట్లు కలిపితే మొత్తం రూ. 1599.94 కోట్లు అవుతుంది. అంటే 2022 డిసెంబర్‌లో పిలిచిన టెండర్ల ధరతో పోలిస్తే ప్రాజెక్టు విలువ 37.33 శాతం పెరుగుతుంది. ఈ మొత్తం విలువ రూ.434.94 కోట్లకు చేరుతుంది. ఇంత భారీస్థాయిలో ప్రజాధనాన్ని కంపెనీకి కట్టబెట్టినప్పటికీ పనులు మొదలుపెట్టలేదని, అందుకే ఈపీడీసీఎల్ సీరియస్‌గా వ్యవహరించిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఓఆర్‌ఆర్ వరకు జీహెచ్‌ఎంసీ!

- పంచాయతీలు, మున్సిపాలిటీల విలీనం
- తెల్లకార్డుల జారీకి మార్గదర్శకాలు
- నేటి క్యాబినెట్‌లో నిర్ణయం

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): క్యాబినెట్ సమావేశం గురువారం మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరగనున్నది. జీహెచ్‌ఎంసీని ఔటర్‌రింగ్‌రోడ్డు వరకు విస్తరించే ప్రణాళికకు క్యాబినెట్ ఆమోదం తెలుపనున్నట్టు సమాచారం. ఔటర్ లోపలి పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీ పరిధిలోకి తీసుకొచ్చేలా నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తున్నది. తెల్లరేషన్ కార్డుల జారీకి సంబంధించిన మార్గదర్శకాలకూ క్యాబినెట్ ఆమోదం తెలిపే అవకాశంఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20లక్షల మందికి పైగా తెల్లకార్డుకోసం దరఖాస్తు చేసుకున్నారు. పాత కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పు, చేర్పులపైనా నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. దీనిపై పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సభలో ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. వీటితోపాటు ధరణి పోర్టల్‌లో మార్పులు, మెడికల్ సైన్స్ బిల్లు తదితర అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం.

### • అంధకారంలో ఖని దవాఖాన



*పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న 85 పడకల ప్రభుత్వ దవాఖానలో అంధకారం అలుముకున్నది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి బుధవారం సాయంత్రం 4 గంటల వరకు కారు చీకట్లో ఉండాల్సి వచ్చింది. ఐసీయూ, సాధారణ ఓపీ, ఎమర్జెన్సీ మెడికల్ విభాగం, జనరల్ ఐపీ గదులకు విద్యుత్తు సరఫరా లేక రోగులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. – ఫర్టిలైజర్‌సిటీ*

## రాష్ట్రంలో 13 చార్జింగ్ స్టేషన్లు

**1000 ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్టీసీ ఆర్డర్**

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు నడిపేందుకు రెడీ అయింది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. మరో వెయ్యి బస్సులను ఆర్డర్ చేసింది. వీటితోపాటు 13 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. హయత్‌నగర్-2, రాణిగంజ్, కూకట్‌పల్లి, బీహెచ్‌ఈఎల్, ఎంజీబీఎస్, జేబీఎస్, హెచ్‌సీయూ, హైదరాబాద్-2, కరీంనగర్-2, నిజామాబాద్, వరంగల్, సూర్యాపేట డిపోల్లో ఏర్పాటుచేయనున్న చార్జింగ్ స్టేషన్లతోపాటు కొత్త ఎలక్ట్రిక్ బస్సులను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు ఆర్టీసీ వర్గాలు వెల్లడించాయి.

### • శ్రీశైలంలో జలసవ్వడి



*ఎగువనున్న ప్రాజెక్టుల గేట్లు తెరవడంతో శ్రీశైలం డ్యాంకు భారీగా ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. బుధవారం 8 గేట్ల నుంచి నీటిని సాగర్ వైపు విడుదల చేస్తున్నారు. 3,62,411 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.*

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.